క్లుప్తంగా

నేడు కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం

హన్మకొండ: కార్మిక నల్ల చట్టాల రద్దు, కార్మికుల హక్కులు, వేతనాలు, సమస్యల పరిష్కారంపై కార్మికులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, చిరు వ్యాపారులు, ఆటో కార్మికులతో ఈనెల 23న ఉదయం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు. బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించనున్న ఈ సమావేశంలో సంఘటిత, అసంఘటిత కార్మికులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, ఆటో కార్మికులు, చిరు వ్యాపారులు, భవన నిర్మాణ రంగ కార్మికులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, స్కీమ్ వర్కర్లు పాల్గొనాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. కార్మికుల సామాజిక, ఆర్థిక భద్రతలకు రక్షణ, హక్కుల కల్పన కోసం ఉమ్మడి కార్యాచరణ రూపొందించుకునేందుకు ఈ సమావేశం దోహదపడుతుందని పేర్కొన్నారు.

నేడు శివుడి విగ్రహ ప్రతిష్ఠాపన

మడికొండ: కాజీపేట మండలం మడికొండలో హిందూ శ్మశానవాటికలో శుక్రవారం శివుడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, రిటైర్డ్ లెక్చరర్ పెట్టెం సాంబయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కార్మికోద్యమ నేతకు నివాళి

న్యూశాయంపేట: కార్మిక ఉద్యమాలనే తన ఊపిరిగా పోరాడిన మహోన్నత నేత పర్స సత్యనారాయణ అని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ కొనియాడారు. హనుమకొండలోని సీపీఎం కార్యాలయంలో సత్యనారాయణ పదో వర్ధంతి సభ గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, చక్రపాణి, రాములు, చుక్కయ్య, వెంకట్, వీరన్న, కుమారస్వామి, మల్లేశం, మల్లయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

ఖిలా వరంగల్: మావోయిస్టులను కాల్చి చంపడాన్ని సీపీఎం తీవ్రంగా ఖండిస్తోందని, వెంటనే వారితో కేంద్రం శాంతి చర్చలు జరపాలని పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు. చర్యలు జరుపుదామని, శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకుందాం అంటూ కేంద్ర ప్రభుత్వానికి మావోయిస్టులు అనేకసార్లు విజ్ఞప్తి చేశారని, లేఖలు రాశారని పేర్కొన్నారు. మావోయిస్టుల పేరుతో అమాయక గిరిజనులను పోలీస్ బలగాలు కాల్చి చంపుతున్నాయని తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో పోలీసుల అత్యుత్సాహం

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవంలో రైల్వే పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. గురువారం ఉదయం స్టేషన్ వద్దకు చేరుకున్న మీడియాను ఐడీ కార్డులు, అక్రిడేషన్ కార్డులు చూపించాలని, లేకుంటే అనుమతి లేదని పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం స్థానిక పోలీసుల జోక్యంతో సభా ప్రాంగణానికి జర్నలిస్టులు చేరుకున్నారు.

కార్మికుడి కుటుంబానికి ఆర్థిక చేయూత



హసన్‌పర్తి: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన సీతానాగారం గ్రామానికి చెందిన కార్మికుడి కుటుంబానికి పంచాయతీ ఉద్యోగులు చేయూతనిచ్చారు. ఈమేరకు గురువారం రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. పేద కుటుంబానికి దాతలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాతల్ల సదానందం, జిల్లా అధ్యక్షుడు తగరం శివ, మండల కార్యదర్శి నరేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, మాజీ సర్పంచ్ దావ రవి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

న్యూశాయంపేట: తమ సమస్యలు పరిష్కరించాలని నగరంలోని 14వ డివిజన్‌కు చెందిన ఎన్టీఆర్ నగర్, సుందరయ్య నగర్, ఎస్ఆర్‌నగర్, తదితర కాలనీవాసులు కోరారు. ఈమేరకు నగరానికి విచ్చేసిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుకు గురువారం వినతిపత్రాలు అందించారు.

ఘనంగా హనుమాన్ జయంతి

నగర వ్యాప్తంగా హనుమాన్ జయంతి ఉత్సవాలను మాలధారులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈమేరకు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, చందన పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా చాలామంది మాల విరమణ చేశారు.

- సాక్షి నెట్‌వర్క్

ఇరుకు గదుల్లో విధులు

- శిథిలావస్థలో కాజీపేట రైల్వే ఈసీసీఎస్ కార్యాలయం
- అరకొర వసతుల మధ్య కార్యాలయ నిర్వహణ
- ఇబ్బంది పడుతున్న సిబ్బంది



శిథిలావస్థకు చేరిన కార్యాలయ భవనం



ర్యాక్స్ లేక చిందరవందరగా ఉన్న ఫైళ్లు, రికార్డులు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లోని రైల్వే ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (ఈసీసీఎస్) క్లస్టర్ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. పాత రైల్వే క్వార్టర్స్‌లో ఈసీసీఎస్ కార్యాలయం నిర్వహణ కొనసాగుతోంది. కాజీపేటలో 2001లో ఈసీసీఎస్ ఏర్పాటయింది. ఈసీసీఎస్‌లో సభ్యులైన రైల్వే కార్మికుల (షేర్ హోల్డర్లు)కు తక్కువ వడ్డీకి రుణాలతో పాటు రైల్వే కార్మికుల పిల్లలకు విద్య, వివాహ రుణాలు ఇస్తుంది. కాజీపేట సీసీఎస్ కార్యాలయం కేంద్రంగా 3 నియోజకవర్గాలు ఉన్నాయి. డైరెక్టర్, కోఆప్షన్ డైరెక్టర్, 13 మంది సీసీఎస్ డెలిగేట్లు, సుమారు 9వేల మంది షేర్ హోల్డర్లు ఉన్నారు. కాజీపేట నుంచి బల్లార్షా – విజయవాడ వరకు రైల్వే కార్మికులు కాజీపేట సీసీఎస్ కార్యాలయం కేంద్రంగా రుణాలు తీసుకుంటారు.

అధ్వానంగా సీసీఎస్ కార్యాలయం

కాజీపేట సీసీఎస్ కార్యాలయంలో ఫ్లోరింగ్, గదులు, తలుపులు, ధ్వంసమయ్యాయి. రెండు గదుల్లో డైరెక్టర్, కోఆప్షన్ డైరెక్టర్, ఆరుగురు ఆఫీస్ సిబ్బంది విధులు నిర్వహించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివిధ రైల్వే స్టేషన్ల నుంచి షేర్ హోల్డర్ల రాకపోకలు, ఆఫీస్ సిబ్బంది విధులతో కార్యాలయం ఇరుకుగా మారి నిలబడేందుకు కూడా చోటులేకుండా ఉంటోంది. కార్యాలయ ఫైళ్లు, పుస్తకాలు, రికార్డులు భద్రపరిచేందుకు ర్యాక్స్ లేకపోవడం, సిబ్బందికి టాయ్‌లెట్లు, తాగనీటి సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. కాజీపేట కార్యాలయంలో వసతుల లేమితో మహిళా సిబ్బంది విధులపై రావాలంటేనే జంకుతున్నారు. అదేవిధంగా, మహిళా షేర్ హోల్డర్లు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోట్ల టర్నోవర్ గల సొసైటీకి మోడల్ సీసీఎస్ భవనం నిర్మించాలని షేర్ హోల్డర్లు కోరుతున్నారు.

ఎన్‌కౌంటర్‌పై విచారణ జరిపించాలి



ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

హన్మకొండ: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మావోయిస్టులు కాల్పులు విరమిస్తూ శాంతి చర్చలకు సిద్ధమని చెబుతున్నా, శాంతి చర్చల కమిటీ ప్రతిపాదనలు ప్రభుత్వం ముందుంచినా కేంద్ర ప్రభుత్వం వాటిని విస్మరిస్తూ కగార్ పేరుతో హత్యాకాండ కొనసాగిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. జీవించే హక్కు ఆర్టికల్ 21కు పూర్తి విరుద్ధంగా అప్రజాస్వామికంగా ఎన్‌కౌంటర్ రూపంలో వందలాది మందిని కేంద్రం పొట్టన పెట్టుకుంటోందని వాపోయారు. నారాయణపూర్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబల్ల కేశవరావుతో పాటు 28 మంది ఎన్‌కౌంటర్ రూపంలో హత్యకు గురయ్యారని అన్నారు. ఇది ఎన్‌కౌంటర్ కాదని, వారిని పట్టుకుని ఏకపక్షంగా కాల్చి చంపినట్లుగా అర్థమవుతోందని అన్నారు. దండకారణ్యంలో పోలీసు క్యాంపులు ఎత్తివేయాలని, సాయుధ బలగాలను వెనక్కి పంపాలని, మధ్య భారతంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా ప్రజా సంఘాల నాయకులు పి.రమేష్ కుమార్, బి.రమాదేవి, జనగామ కుమారస్వామి, సారంగపాణి, ఓంబ్రహ్మం, ఉదయ్‌సింగ్, ఎ.రాజయ్య, ఇంద్రసేనా, జ్యోతి, క్రాంతి, మహేష్, డాక్టర్ కొతం కృష్ణ, కె.శంకర్‌రావు, ఎస్.రామబ్రహ్మం, యాకూబ్, మహ్మద్ పర్వేజ్, కందికొండ బుచ్చిరాములు, వి.ప్రభాకర్ రెడ్డి, ఎండీ.అయూబ్, డి.ప్రవీణ్ కుమార్, ఎం.వేంగల్ రెడ్డి, అనిత, తిరుపతి పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి సహకరిస్తా

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సంఘం బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్: క్రీడాకారుల సంక్షేమం, క్రీడల అభివృద్ధికి తనవంతుగా సహకరిస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్‌గా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని ఆయన అనుమతితో అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానించినట్లు అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి వీరన్న తెలిపారు. ఈ సందర్భంగా బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో ఎమ్మెల్యేను గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రెసిడెంట్ రవీంద్ర కుమార్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, సెక్రటరీ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సుదర్శన్, కార్యవర్గ సభ్యుడు గడ్డం అనిల్, సీనియర్ క్రీడాకారులు తిరుపతి, సాత్విక్, ఎల్లస్వామి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు

హన్మకొండ చౌరస్తా: వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 58వ డివిజన్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నారు. సుధాకర్, మేరీ, మండల సమ్మయ్య, ప్రసన్న ఆధ్వర్యంలో పవన్, చంటి, దయాకర్, రాకేష్, వినయ్, ఆరిఫ్, భార్గవ్, ఏసుపాదం, ఏలియా, రాజేందర్ తదితరులు పార్టీలో చేరారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సూచించారు. హనుమకొండ చౌరస్తాలోని ప్రధాన నాలాను గురువారం రాత్రి పరిశీలించారు. వరదనీరు సాఫీగా వెళ్లేలా నాలాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని అధికారులకు ఫోన్ ద్వారా సూచించారు.

ప్రతీ కాలనీకి రోడ్డు



రోడ్డును ప్రారంభిస్తున్న నాగరాజు

న్యూశాయంపేట: వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని డివిజన్లలోని ప్రతీ కాలనీలో రోడ్డు సౌకర్యం, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు తెలిపారు. నగర పరిధిలోని 3వ డివిజన్ కేఎస్ఆర్ కాలనీలో నిర్మించిన అంతర్గత రోడ్డును మేయర్ గుండు సుధారాణితో కలిసి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జన్ను షీబారాణి, నాయకులు అనిల్‌కుమార్, లాలునాయక్, వెంకన్న, సుధకార్, అరుణాకర్, అధికారులు పాల్గొన్నారు.

మరో రెండు రోజులు వర్షాలు

హన్మకొండ: మరో రెండు రోజులపాటు వర్షాలు కురవనున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. గురువారం సాయంత్రం హనుమకొండ జిల్లాలో తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. రాత్రి 8 గంటల వరకు జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలను వాతావరణ శాఖ విడుదల చేసింది. జిల్లాలో అత్యధికంగా ఎల్కతుర్తిలో 32.8 మిల్లీ మీటర్లు, భీమదేవపల్లిలో 24.3, దామెరలో 22.8, కమలాపూర్‌లో 15, శాయంపేటలో 12, ఆత్మకూరులో 8.3, వేలేరులో 7.3, నడికుడలో 7.8, ధర్మసాగర్‌లో 3.5 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

టీచర్లు అద్భుతాలు సృష్టించవచ్చు



మాట్లాడుతున్న సోమయ్య

విద్యారణ్యపురి: ప్రభుత్వ ఉపాధ్యాయులు మనస్సు పెడితే అద్భుతాలు సృష్టించవచ్చని హనుమకొండలోని ప్రభుత్వ డైట్ కళాశాల రిటైర్డ్ అధ్యాపకుడు సోమయ్య అన్నారు. హనుమకొండ మండలంలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం హనుమకొండలోని డీపీఎస్ స్కూల్‌లో కొనసాగుతోంది. ఈ కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించి ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు. హనుమకొండ మండలంలో అనేక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు బాగానే ఉందన్నారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వ పాఠశాలల పట్ల నమ్మకాన్ని పెంచితే విద్యార్థుల సంఖ్య ఇంకా పెరుగుతుందని చెప్పారు. విద్యార్థులు నాణ్యమైన విద్యను అందించేందుకు, నూతన పద్ధతుల్లో విద్యాబోధనకు ఇలాంటి శిక్షణలు దోహదం చేస్తాయన్నారు. కోర్సు డైరెక్టర్ మండల విద్యాశాఖాధికారి నెహ్రూ, రిసోర్స్‌పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిగులు భూములను పంచాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఖిలా వరంగల్: ప్రభుత్వ మిగులు భూములు దళితులకు పంపిణీ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో సంగి ఎలేందర్ అధ్యక్షతన దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రెండో రాష్ట్ర మహాసభల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్‌కౌంటర్లు అన్ని ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. దేశవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్, ఏసురత్నం, తాళ్లపల్లి లక్ష్మణ్, నలిగంటి శ్రీనివాస్, లావణ్య, ధనలక్ష్మి, జన్ను రవి తదితరులు పాల్గొన్నారు.

లీగల్ మెట్రాలజీ చైతన్య కార్యక్రమం



సిలిండర్లను పరిశీలిస్తున్న అజీజ్

రామన్నపేట: అంతర్జాతీయ లీగల్ మెట్రాలజీ వారోత్సవాల్లో భాగంగా వరంగల్ నగరంలోని పెట్రోల్ బంకులు, ఎలక్ట్రిక్ షాపులు, భారత్ గ్యాస్ కంపెనీలో వరంగల్ లీగల్ మెట్రాలజీ శాఖ, వినియోగదారుల మండలి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా లీగల్ మెట్రాలజీ ఆఫీసర్ అజీజ్ మాట్లాడుతూ వివిధ వ్యాపారాల్లో లీగల్ మెట్రాలజీ రూల్స్ –2011 ప్రకారం తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, వంటగ్యాస్ సిలిండర్ 14.2 కిలోల బరువు ఉండాలని అన్నారు. పెట్రోల్ బంకుల్లో లీగల్ మెట్రాలజీ ముద్ర ఉన్న కొలతలతో పెట్రోల్‌ను సరి చూసుకోవాలని చెప్పారు. ఎలక్ట్రిక్ షాపుల్లో నకిలీ ఎలక్ట్రిక్ వైర్లు, మీటర్లు, ఎలక్ట్రిక్ పొయ్యిలు, బల్బుల కొనుగోలులో వినియోగదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, రావుల రంజిత్‌కుమార్, నల్లా రాజేందర్, గంగరాజు సతీష్, రామోజు శ్రీనివాస్, నగర కార్యదర్శి దామెర శ్యామ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 24, 25వ తేదీల్లో మంచిర్యాలలో జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులను ఎంపిక చేసినట్లు బాక్సింగ్ సంఘం జిల్లా కార్యదర్శి పి.రాజేందర్ తెలిపారు. హనుమకొండ ప్రభుత్వ పాఠశాల పక్కన ఉన్న డీఎస్ఏ బాక్సింగ్ హాల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలను గురువారం నిర్వహించినట్లు వివరించారు. ఎంపికకు ఉమ్మడి జిల్లా నుంచి 20మంది బాలబాలికలు హాజరు కాగా, బాలుర విభాగంలో 46 – 48 కిలోల విభాగంలో కే.సాత్విక్, 52 – 54 కిలోల విభాగంలో షేక్‌రిజ్వాన్, బాలికల విభాగంలో 54 – 57 కిలోల విభాగంలో వై.నక్షత్ర, 66 – 70 కిలోల విభాగంలో ఎస్.తనుశ్రీ ఎంపికైనట్లు రాజేందర్ తెలిపారు.

జిల్లా సదస్సును విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మంద కుమార్‌మాదిగ

కేయూ క్యాంపస్: ఈనెల 24న క్యాంపస్‌లోని సెనెట్ హాల్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి సదస్సును విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీలోని గెస్ట్ హౌస్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డు వచ్చిన సందర్భంగా జూన్ చివరి వారంలో ఆయనకు ఆత్మీయ సన్మానం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆత్మీయ అభినందన సభ విజయవంతానికి ఈనెల 24న కాకతీయ యూనివర్సిటీలో ఉమ్మడి వరంగల్ జిల్లా సదస్సును నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిమాదిగ, ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సుకుమార్ మాదిగ, బాధ్యులు డాక్టర్ సంకినేని వెంకట్, పుట్ట రవి, బుర్రి సతీష్ మాదిగ, ఆయా సంఘాల బాధ్యులు నారాయణ, గంగరపు శ్రీనివాస్, శాంతిసాగర్ తదితరులు పాల్గొన్నారు.

డే కేర్ సెంటర్‌కు పుస్తకాల అందజేత



పుస్తకాలు అందిస్తున్న అనితారెడ్డి

హన్మకొండ: హనుమకొండ జిల్లా ప్రజాపరిషత్ ఆవరణలోని సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్‌కు అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ సభ్యురాలు కరుకాల అనితారెడ్డి పలు పుస్తకాలను గురువారం అందించారు. వయో వృద్ధులు ఈ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. పుస్తకాలు విజ్ఞానం, కాలక్షేపానికి ఉపయోగపడతాయన్నారు. ఇటీవల దాతల సహకారంతో టీవీ, ఎయిర్ కూలర్, కుర్చీలు సమకూర్చినట్లు వివరించారు. ఫిజియోథెరపిస్టు డాక్టర్ ఉష, వాణి, అర్చికారెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఆర్ట్స్ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కళాశాల బోధనేతర ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. ఈమేరకు కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు బి.రాజు మాట్లాడుతూ కళాశాలలో ఆరేడు నెలలుగా అసిస్టెంట్ రిజిస్ట్రార్‌ను నియమించలేదని, దాంతో పలు సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. వందేళ్లు పూర్తి చేసుకుంటున్న క్రమంలో కళాశాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

రామన్నపేట: ప్రతిఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షిస్తూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఏవీవీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కొనిమాల శ్రీనివాసరావు సూచించారు. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా కళాశాల ఆవరణలో గురువారం పలు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవుడి స్వయం కృపారాదమైన నివాసం, ఆహారం కోసం పచ్చని చెట్లను నరకడం వల్ల ఆక్సిజన్ కరువైందని అన్నారు. దీనికి తోడు వాహనాల పొగ, ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో కాలుష్యం కోరలు చాస్తూ మానవ మనుగడమే ప్రమాదంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మానవుడు మేల్కొని భవిష్యత్ తరాల మనుగడ కోసం పర్యావరణ పరిక్షణకు పచ్చదనం పెంచేలా మొక్కలు నాటాలని సూచించారు.

కూలీల బకాయిలు విడుదల చేయాలి



న్యూశాయంపేట: ఉపాధి కూలీల పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.ప్రసాద్ డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక కూలీల ఉపాధికి నిధుల కోతపెట్టిందని విమర్శించారు. కూలీ రేట్లు పెంచాలని, పట్టణ కూలీలకు ఉపాధి హామీ పని కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న కలెక్టరేట్ల ముట్టడి చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి జి.రాము, భిక్షపతి, పద్మ, లావణ్య, సుధాకర్, నందం, మమత, చందు, అనిఫా పాల్గొన్నారు.

అమెరికా సమావేశానికి వినయ్‌భాస్కర్‌కు ఆహ్వానం

హన్మకొండ: అమెరికాలో ఈనెల 30, 31వ తేదీల్లో నిర్వహించనున్న గ్లోబల్ మున్నూరుకాపు అసోసియేషన్ మహాసభకు రావాలని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్‌ను అసోసియేషన్ నాయకులు కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లో వినయ్‌భాస్కర్‌ను గురువారం కలిసి ఆహ్వాన పత్రిక అందించి ఆహ్వానించారు. ప్రపంచ నలుమూలల్లో ఉన్న మున్నూరుకాపులను అమెరికా వేదికగా ఏకం చేయనున్నట్లు గ్లోబల్ మున్నూరుకాపు అసోసియేషన్ బాధ్యుడు వంశీ తెలిపారు.

రైల్వే సంఘ్ జాతీయ నేతకు సన్మానం

కాజీపేట రూరల్: దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సికింద్రాబాద్ జోన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మర్రి రాఘవయ్యను కాజీపేట జంక్షన్‌లో కాజీపేట అన్ని బ్రాంచీల నాయకులు గురువారం కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో రాఘవయ్య, సంఘ్ జాయింట్ జనరల్ సెక్రటరీ భరణిభానుప్రసాద్ మద్రాస్ నుంచి సికింద్రాబాద్ వెళ్తూ మార్గమధ్యలో కాజీపేట జంక్షన్‌లో దిగారు. ఈ సందర్భంగా కాజీపేట సంఘ్ నాయకులు రాఘవయ్యను స్వాగతించి, రైల్వే ఏడో పే కమిషన్, స్థానిక రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో రైల్వే సంఘ్ కేంద్ర కమిటీ సభ్యుడు వెంకటనారాయణ, బల్వీందర్ సింగ్, మాధవరావు, రాజేందర్, అభిలాష్, రవి, నర్సింగరావు, యాకూబ్‌పాషా పాల్గొన్నారు.

క్రైం కార్నర్

లారీ – బైక్ ఢీ.. యువకుడి మృతి

హసన్‌పర్తి: లారీ – బైక్ ఢీకొట్టిన సంఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. ఆరెపల్లి – యాదాద్రి మార్గమధ్యలోని దేవన్నపేట సర్కిల్ వద్ద బుధవారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. హసన్‌పర్తి మండలం నిరప్‌నగర్ తండాకు చెందిన మాలోతు శ్రీకాంత్ (24) భవన నిర్మాణ కార్మికుడు. బుధవారం రాత్రి దేవన్నపేట నుంచి నిరూప్‌నగర్ తండాకు బైక్‌పై బయల్దేరాడు. దేవన్నపేట సర్కిల్ వద్ద బైక్ యూటర్న్ చేసుకుని ముందుకు సాగుతుండగా, ఆరెపల్లి నుంచి భువనగిరి వైపునకు వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొంది. దాంతో తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మడికొండ: ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన అమ్మవారిపేట గ్రామంలో జరిగింది. మడికొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాజీపేట మండలం అమ్మవారిపేట గ్రామానికి చెందిన మైదం చేరాలు (54) కొద్ది నెలలుగా మానసిక స్థితి బాగాలేక బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగాడు. అది గమనించి కుటుంబ సభ్యులు నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం సాయంత్రం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

నకిలీ బంగారంపై బ్యాంకుల్లో రుణం

వరంగల్ క్రైం: బ్యాంకుల్లో నకిలీ బంగారాన్ని కుదువ పెట్టి వాటితో వచ్చి డబ్బులతో జల్సాలు చేస్తున్న వ్యక్తిపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పల్లగుట్టకు చెందిన తాళ్లపల్లి ప్రవీణ్.. నకిలీ బంగారాన్ని ముత్తూట్ మినీ ఫైనాన్స్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో కుదువ పెట్టాడు. ఆ బంగారం నకిలీదిగా గుర్తించిన సెంట్రల్‌బ్యాంక్ మేనేజర్ ముత్యాల మురళబు.. సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు ప్రవీణ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు.

హోటల్‌లో పాడైన చికెన్, మటన్

హసన్‌పర్తి: పాడైన చికెన్, మటన్‌తోపాటు గడువు తీరిన ఆహార పదార్థాలు విక్రయిస్తున్న ఓ హోటల్‌పై టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు నిర్వహించింది. ఈమేరకు సుమారు రూ.24,500 విలువైన ఆహార పదార్థాలు స్వాధీనం చేసుకుంది. నక్కలగుట్ట సమీపంలోని 20ఎస్ చికెన్ రెస్టారెంట్‌లో గురువారం టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు నిర్వహించింది. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎం.రంజిత్‌కుమార్, దిలీప్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన లారీతో పరారీ

హసన్‌పర్తి: సీజ్ చేసిన లారీతో పరారైన డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అనుమతులు లేని లారీని ఇటీవల డిప్యూటీ ట్రాన్స్‌ఫోర్స్ అధికారి సీజ్ చేశారు. ఈనెల 17న ఉదయం సదరు డ్రైవర్ సతీష్.. ఫెనాల్టీ చెల్లించకుండానే లారీతో పరారయ్యాడని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ అధికారి శ్రీధర్.. సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి సదరు డ్రైవర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదెల మృతి

హసన్‌పర్తి: విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి చెందిన సంఘటన హసన్‌పర్తి మండలం సీతానాగారం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. దావ తిరుపతికి చెందిన పన్నెండు గేదెలు మోతకు వెళ్లాయి. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురై 3 గేదెలు అక్కడక్కడే మృతి చెందాయి. ఒక్కో గేదె విలువ సుమారు రూ.90 వేలు ఉంటుందని బాధితుడు వాపోయాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్ డిమాండ్ చేశారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
వి. రాజ్ కుమార్ (SR) : 9966290903 (హన్మకొండ)
కె. రవీందర్ (SR) : 9705236356 (వరంగల్)
పి.చంద్రశేఖర్ (ACO) : 9963646944 (వరంగల్)